

# పద్మవ్యూహం

## - కుప్పిలి పద్మ



ఆధునిక యువతరం పోకడలకి అద్దంపట్టే కథాపరంపర

# గోదారంత ప్రేమ...

**తొలి వేసవి సాయంకాలపు చల్లనిగాలి ముఖాన్ని స్పర్శిస్తోంటే యింద్రాణి వాల్డన్ మెట్లు యెక్కు తోంటే 'గోరితెర' అంటూ ఆమె సెల్ మోగింది. తీసి చూసింది.**

వైశాలి.

"వైషూ... చెప్పు"

"అయ్యో.. యెందుకు తీసావ్...? నువ్వు చై మామ్ " పసితనం యింకా వీడని లేతస్వరం కంగారుగా అంది.

యిదో గొడవ. రీఛార్జ్ బ్యాలెన్స్ అయిపోతుందేమోనని యీ హడావిడంతా. నేనేగా రీఛార్జ్ చేయించేది. అయినా సరే మిస్డ్‌కాల్స్ యిస్తుంది. యెప్పుడైనా లిఫ్ట్ చేస్తే బ్యాలన్స్ అంటూ గోల అనుకొంటూ కాల్ చేసింది యింద్రాణి.

"వాల్డన్‌లోకి వెళ్ళబోతోన్నా. నువ్వెక్కడ?"

"సిటి సెంట్రల్లోంచి బయటకి వచ్చా. మా ఫ్రెండ్స్ వెళ్లిపోయారిప్పుడే. అక్కడికి రానా. యింటికి వెళ్లిపోనా?"

"నీ యిష్టం. వోపిక వుంటేరా" అంది యింద్రాణి.

"వస్తా" అంది వైశాలి.

యింద్రాణి వాల్డన్‌లోకి వెళ్లింది.

ఆ బుక్‌స్టోర్స్ వోపెన్ చేసినప్పట్నుంచి యింద్రాణి రెగ్యులర్ కస్టమర్. అప్పట్నుంచి వున్న స్టాఫ్‌కి ఆమె చిరపరిచితురాలు. కౌంటర్‌లో వున్నవాళ్లని పలకరించి న్యూ బుక్స్ ముందు నిలబడింది చూడగానే అరుంధతిరాయ్ 'ది ఫోల్డెడ్ యెర్త్' కనిపించింది ఆత్మీయంగా చేతుల్లోకి తీసుకొంది. పేజ్ తిప్పింది. అంకితంలో రాసిన మొదటి వాక్యం చదవగానే ఆ పుస్తకాన్ని అమ్మకి యివ్వాలనిపించింది. మరిన్ని కొత్త పుస్తకాలని అటుయిటు తిప్పి చూసింది. పక్క సెక్షన్‌లోకి వెళ్లింది. మెరూన్ కలర్ నైటింగేల్ రూల్‌బుక్ తీసుకొంది. అలాంటి పుస్తకాల్లో కవిత్వం రాసియిచ్చేవాడు కిరీటి. నిండా ప్రేమే. వొక్కోసారి అవి కవిత్వాలో, లేఖలో అర్థం కాక అడిగితే ప్రేమ వచన కవిత్వం అనేవాడు. అసలు యిప్పుడీ ప్రేమ యేంటి బాబు అంటే యిప్పుడీ ప్రేమ ప్రపంచానికి చాలా అవసరం అనేవాడు. అచ్చుకి మాత్రం పంపించేవాడు కాదు. పంపించమని అడిగిన ప్రతిసారి ఫర్‌ఫెక్షనిజం రావాలనేవాడు. అది వచ్చినా ఆ విషయం అతనికి యెలా తెలుస్తుందబ్బా అనే సందేహం ఆమెకొచ్చేది. అడిగితే ప్రమాదం. ఫర్‌ఫెక్షనిజం మీద వో గంట మాటాడతాడు. వైశాలికి యేం కొనాలాని ఆలోచిస్తూ ఫిక్షన్ వైపుకి వెళ్లి గాన్ విత్ ద విండ్ తీసుకొంది. ఆమె దగ్గర కాపి వుంది కాని యిది అచ్చంగా వైషూ కోసం... బిల్ పే చేసింది.యెప్పటిలా అడక్కుండానే డిస్కౌంట్ యిచ్చారు. యింద్రాణి యిప్పటి వరకు యెక్కడా డిస్కౌంట్ అడగలేదు. బేరం చేయటానికి మొహమాటం. వైశాలికి బేరాలంటే చాల సరదా. బయటకి వచ్చి రైలింగ్‌ని అనుకొని నిలబడింది. వెడల్పైన రోడ్. ట్రాఫిక్ ప్రవహిస్తోంది. రఫ్‌గా,

యీ ఫ్లైవోవర్స్ లేని రోజుల్లో యీ బిల్డింగ్ లోపల పార్కింగ్ వుండేది. అప్పటికి క్రాస్‌వర్డ్, ల్యాండ్‌మార్క్ యీ సిటికి రాలేదు. ఆదివారం సాయంకాలాల్లో యీ షాప్ నిండా మనుష్యులే. సందడిసందడిగా వుండేది. అప్పటికి సి.యంస్ ఆఫీషియల్ రెసిడెన్స్ యిక్కడ లేదు. అసలు చుట్టు పక్కల అప్పట్లో వున్నవి యేవి యిప్పుడు ల్యాండ్‌మార్క్లు కావు. యిప్పుడన్నీ కొత్తకొత్త ఆనవాళ్ళు. చిరునామాలు. శ్రీనివాస టవర్స్ మాత్రం వున్నాయి. మిగిలిన యిళ్ళు యేం లేవ్. ఆ యెదురుగా...

"మామ్, నువ్వు నన్ను చూడలేదంటే నువ్వెక్కడో తప్పిపోయావ్.. ప్రెజెంటూ... ఫాస్టూ.. ఫ్యూచర్.. నో వే. ఫ్యూచర్ గురించి ఆలోచించవ్. ఫాస్టే కదా" నవ్వుతూ అంది వైశాలి.

"కిరీటి యింట్లో గానుగ చెట్టు వుండేది. యీ కాలంలో యెండిన ఆకులు రాలుతుండేవి. ఆ ఆకుల సవ్వడి గరగ్గా వుండేది. పచ్చని గానుగాకుల గాలి సవ్వడి మృదువుగా వుండేది. యెదురుగా వుండే యీ బుక్ షాప్‌కి రెగ్యులర్‌గా వచ్చేవాళ్లం. వొక్కోసారి అక్కడే నిలబడి ముందునుంచి వొకళ్ళు, వెనకనుండి వొకళ్ళు పుస్తకం చదివేస్తుండేవాళ్ళం. తర్వాత యిద్దరం వొకళ్ళ కొకళ్ళం చదవని కథను చెప్పుకునేవాళ్ళం. కిరీటికి చిరు తిండంటే చాలిష్టం. ఆ ఫ్లైవోవర్ బ్రిడ్జ్ వరకో లేదా అమీర్‌పేట గుడి వరకో వెళ్ళి తెగతినేవాళ్ళం. నిన్ను కూడా చిన్నప్పుడు యిక్కడికి తీసుకొచ్చేదాన్ని. బొమ్మలంటూ తెగ గొడవ చేసేదానివి. యిదిగో యీ పుస్తకాలు తీసుకున్నా. యింకా నీకేమైనా కావాలా" అడిగింది యింద్రాణి.

వాటివైపు చూస్తూ "రీఛార్జ్ కార్డ్ వుంటుందా యిక్కడ" అడిగింది వైశాలి.

వుండవన్నట్టు పెదవి విరిచింది యింద్రాణి.

"యేం వుంటాయి..?" క్షణం ఆలోచించి "డైరీ మిల్క్" అంది వైశాలి.

యిద్దరు లోపలికి వెళ్ళారు.

వాళ్ళిద్దరూ చిన్నప్పట్నుంచి వొకే స్కూల్లో చదువుకున్నారు. యిప్పుడీ యింజినీరింగ్‌లో వేరే కాలేజస్. కానీ ఫ్రెండ్స్ అంతా అప్పుడప్పుడు కలుస్తుంటారు.

"యేమో.. నీకు తెలుసుగా యెవరికైనా పుస్తకాలే యిస్తానని. నీ ఫ్రెండ్స్ బుక్స్ చదవరంటావ్. చూడు నీకేమైనా వేరే ఐటమ్స్ న చ్చుతాయేమో?" అందామె.

అటూ యిటూ తిరిగి "యివన్నీ బోరింగ్. అసలే ఆ మానవుడి యింట్లో వాళ్ళ మామ జపాన్ నుంచి వచ్చేసారనే టెన్షన్‌లో వున్నారు. యింత సీరియస్‌వి కానివి యిద్దాం" అంది వైశాలి.

యిద్దరూ బయటకి వచ్చారు.

కారు స్టార్ట్ చేసింది యింద్రాణి.

"మామ్.. విండో షాపింగ్ చేద్దామా?" అడిగింది.

"వోకే.. కాని యీ టైమ్‌లో మనకి పార్కింగ్ యెక్కడ దొరుకుతుంది. అయినా ట్రై చేద్దాం. మన బుజ్జికి యెంత ప్లేస్ కావాలే" అని అంది యింద్రాణి.

అమీర్‌పేట వెళ్లారు. గుడి సందులో వో మూలకి ఆల్టోని తోసేసి తల్లీకూతుళ్ళిద్దరూ నడుచుకొంటూ ఆ రద్దీ మార్కెట్‌లో బళ్ల మీద క్లిప్స్, పిన్స్, బొట్టుబిళ్లలు యిలా చిన్న చిన్న వస్తువులు కొంటున్నారు.

యింద్రాణి ఫోన్ మోగింది.

కిరీటి.

"హాయ్ కిరీటి యెలా వున్నావ్" అడిగింది యింద్రాణి.

"గుడ్. నువ్వా?"

"బాగున్నాను. వైషూకి యిందాకే మీ యింట్లోని గానుగ చెట్టు గురించి చెప్పాను. అమీర్‌పేట్‌లో విండోషాపింగ్ చేస్తున్నాం

యిద్దరం”
“వో ఐసీ... యింటికి వెళ్లాక కాల్ చేస్తాలే. యెంత సేపుపడుతుంది యింటికి వెళ్లటానికి?” అడిగాడు.
“వో అరగంటా.. యేంటలా వున్నావ్?” కాస్త ఆదుర్దాగా అడుగుతున్నాడేంటని ఆలోచిస్తూ అడిగింది.
“నువ్వు యింటికి వెళ్లాక మాటాడతాను. బై” అన్నాడు.
“అంకుల్ యేదో మాటాడాలంట. అప్‌సెట్‌గా అనిపించారు యింక యింటికి వెళ్లదామా?” అడిగింది యింద్రాణి.
“వోకే.. హేమూ వాళ్ల మామవాళ్లు జపాన్‌లో వుంటారు కదా. యిప్పుడొచ్చేసారు యిండియాకి”
“యేది.. మొన్నొచ్చిన సునామీకి భయపడా...?”
“వూ.. పేనిక్ అయిపోయారనుకో. రాగానే వచ్చేసారు. ఆ సునామీ, ఆ భూకంపం కంటే రేడియేషన్‌కి చాలా భయపడ్డారు. అసలు నేచురల్ డిజాస్టర్స్ కంటే యీ రేడియేషన్ వేరీ డేంజర్. అసలు అలాంటివి యెందుకు పెడతారు. యిలాంటివి వద్దని బాగా యెవేర్‌నెస్ క్రియేట్ చెయ్యాలి. నాకు యిలాంటి విషయాల మీద పనిచెయ్యాలని వుంటుంది. నువ్వొద్దంటావా..?” అడిగింది వైశాలి.
ఆ మాటలకి ముచ్చట పడింది యింద్రాణి. వెంటనే జవాబు యివ్వలేకపోయింది.
“యేంటి మాటాడవ్?” తిరిగి అడిగింది వైశాలి.
“పిల్లలు మంచిమంచి పొజిషన్స్‌లోకి వెళ్లాలని పేరెంట్స్‌గా మేమనుకొంటాం. కానీ మీకు నచ్చిన యేరియాలో పనిచేయాలన్నప్పుడు వద్దనకుండా వుండటం కూడా పేరెంట్స్‌గా మా బాధ్యతే. వొక్కోసారి సిస్టమ్‌కి యెగైనెస్ట్‌గా లేదా సిస్టమ్‌ని ప్రశ్నించినప్పుడు చాలా చికాకుని యెదుర్కోవాల్సి వస్తుంది. అప్పుడు యివన్నీ మన పిల్లలకి అవసరమా అని పేరెంట్స్ అనుకోవచ్చు. కానీ నువ్వేదైనా యీ ప్రపంచాన్ని రక్షించుకోవటానికి నీ పరిథిలో పనిచేస్తానంటే నేనెప్పుడూ నీవెంటే వైషూ” అంది యింద్రాణి.
“వో మామ్... థ్యాంక్స్. పోయినసారి సునామి వచ్చినప్పుడు సముద్రం వొడ్డుకి అసలు యెవరైనా వెళతారా అని తెగ మాటాడేసారు. బట్ తరువాత అంతా ఆ భయాన్ని మర్చిపోయారు యెక్కడైనా లైఫ్‌లో రిస్క్ వుంటుందంటే పారిపోతామా... నిలబడాలి కాని.. మా క్లాస్‌లో సంజనవాళ్ల మమ్మీ చెప్పిందంటా సంజనాకి పెళ్లి చేసినా యిక్కడే వుండాలంట. యిక్కడైతే భూకంపాలు రావంట. సునామీలకి ఛాన్స్ లేనేలేదంట. తుఫాన్‌లు రావు. మహా అయితే యిక్కడ వానలొస్తే వరదలొస్తాయి. మ్యాన్‌హోల్స్‌పై మూతలుండవ్. కొట్టుకుపోయే ప్రమాదముంది. వానొచ్చినప్పుడు యెక్కడుంటే అక్కడే వుండటమో.. లేదా కాస్త బెటర్ ప్లేస్‌కి వెళ్లటమో చేయొచ్చు. మేనేజబుల్ అంటుందంట. యీ పిచ్చిది అదేదో గ్రేట్ యిష్యూగా ప్రౌడ్‌గా చెపుతోంది. లాస్ట్ టైమ్ బాగా వర్షాలు కురిసాయి కదా.. మ్యాన్‌హోల్స్ మీద కవర్ చెయ్యండని వో లెటర్ మునిసిపల్ ఆఫీస్‌లో యిద్దాం సైన్ చేయమంటే సంజనా మా మమ్మీని అడిగి చెపుతానంది. నీకిలాంటి గోలంతా ఎందుకందంట వాళ్ల మమ్మీ. సైన్ చేయలేదు. అలా బిహేవ్ చేయటం కరెక్ట్ కాదనిపించింది మా గ్రూప్‌కి” అంది వైశాలి.
“టైమ్‌వేస్ట్ అనుకొనివుండొచ్చు” అంది యింద్రాణి.
“ తనొక్కతే కాదు. ఆ వొక్క యిష్యూనే కాదు మామ్... పోయినసారి శ్రీకాకుళం దగ్గర ప్లాంట్ వద్దని గొడవ చేస్తే ఫైరింగ్ చేసారు కదా. అసలా యిష్యూ యేంటనే క్యూరియాసిటి కూడా మా కాలేజ్‌లో చాలామందికి లేదు. వాళ్ల పేరెంట్స్‌కి కూడా అదేదో అక్కడివాళ్ల గోలగానే కనిపిస్తుంది తప్పా అందరికి సంబంధించినదనుకోలేదు మా కాలేజ్‌లో కరెంట్ యిష్యూస్‌పై ప్రాజెక్ట్ వర్క్ చేయమంటే నేనీ టాపిక్ తీసుకొంటే అంతా చాదస్తమని నవ్వారని చెప్పానా. యీ రోజు యేమయిందో తెలుసా. స్టూడెంట్స్ డాక్యుమెంటరి ఫిల్మ్ ఫెస్టివల్‌కి యింట్రస్ట్ వున్నవాళ్ల నేమ్స్ యిమ్మన్నారు.బోరింగ్ టాపిక్స్ సెషన్ వుంటే వైశాలి నేమ్ రాసుకోండి. తన దగ్గర చాలా ఐడియాస్ వుంటాయి. వ్వాటే యాన్ ఐడియా అని అభిషేక్ బచ్చన్‌లా అంటూ చాలా టీజ్

చేసారు. ఆ విషయమే మా స్కూల్ ఫ్రెండ్స్‌తో చెప్పి వస్తున్నాను. యిప్పుడీ విషయమంతా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తాను. మా స్కూల్ ఫ్రెండ్స్ సపోర్ట్ చేస్తామని చెప్పారు. బుర్రలో అదే తిరుగుతుందనుకో.. అందుకే అలా కాస్త తిరుగుదాం అన్నాను. రిలాక్స్ అవ్వాలి కదా. యిప్పుడు ఫేస్‌బుక్‌లో పెట్టేస్తే యీ కాలేజ్ ఫ్రెండ్స్ దారికి వచ్చేస్తారేమో..." అంది వైశాలి.
యింద్రాణికి వో వైపు నవ్వూ మరోవైపు ఆశ్చర్యం.
మొన్నటికి మొన్న వైశాలి హ్యాండ్‌రైటింగ్ బాగోదు అందంట కాలేజ్‌మేట్ నిశాంతి. నిజానికి వైశాలిది చక్కని చేతిరాత. నిశాంతి యెందుకందో, ఆ సాయంత్రం ఆ కామెంట్ చేసిన నిశాంతి పేరు పెట్టకుండా విషయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. అంతా యేకగ్రీవంగా వైశాలి చేతిరాత బాగుంటుందని చెప్పడంతో నిశాంతి "వో గాడ్.. లైట్ తీసుకో. వూరికే అన్నాను. అందరి ముందూ పెడతావా.. నా పేరు పెట్టకపోయినా నేనన్నానని నాకు తెలుసుగా. నీ రైటింగ్ బానే వుంటుందిలే. కావాలంటే అన్నది నేనేనని చెపుతా" అని నిశాంతి.
అందరికి ఆ విషయం చెప్పే వరకు ఆ సాయంకాలమంతా ఆ పంచాయితీ నడిచింది.
"అదేం పెద్ద విషయమమ్మా వైషూ?" అని అడిగితే " నాకది యింపార్టెంట్‌గా వుంది" అంది. యిప్పుడు యీ యిష్యూ. అప్పుడే చాల చిన్నపిల్లల్లా తోస్తారు. వాళ్ళవాళ్ళ సమస్యల్లో సడెన్‌గా మెచ్యూర్డ్‌గా అనిపిస్తారు.వ్వాటార్ దే.. యింద్రాణి ఆలోచిస్తూ డ్రైవ్ చేస్తోంది.
"అసలా యేజ్‌లో అమ్మకి మేం యెలా కనిపించుంటామో.. అమ్మని అడిగితే?" అనిపించింది యింద్రాణికి.
యిల్లొచ్చింది.
యింటి దగ్గరున్న కిరాణా కొట్లో రీఛార్జ్ కార్డ్ వేయించుకోవడానికి వెళ్లింది వైశాలి.
కిరీటికి కాల్ చేయటం కంటే ముందు తన సందేహం తీర్చుకోవటం ముఖ్యమనిపించింది యింద్రాణికి. మొగలిరేకులు చూస్తున్న తల్లిని చూసి "యిప్పుడడగటమంత బుద్ధితక్కువ మరోటి లేదు. తను తరువాతైనా టాటాస్కైలో రికార్డ్ చేసింది చూస్తుంది. కాని అమ్మ అలా కాదు. ఆ రియల్ టైమ్‌లో చూడటాన్నే యెక్కువగా యిష్టపడుతుంది. తల్లితో పాటు చూస్తు కూర్చుంది. "బ్రేక్‌లో అడగాలి" అనుకొంది. బ్రేక్ వచ్చింది. వెంటనే ఫోన్ చేసి యిప్పటి వరకు జరిగింది చెపుతోన్న తల్లిని చూసి " యెవరింట్లోనే పవర్ పోయి వుంటుంది. యే వూరి ప్రజలో?" యిది తరచుగా జరిగే విషయమే. యిక్కడ పవర్ పోయినా యింటిల్లిపాది యిలానే యెవరితోనైనా చెప్పించుకొని వింటారు.
సీరియల్ అయ్యాక తల్లిని తన సందేహం అడిగింది. ముందామెకి యింద్రాణి అడిగింది అర్థం కాలేదు. అర్థం అయ్యాక "పధ్నాలుగేళ్ళప్పుడు నా పెళ్లయింది. పదహారేళ్లకి నువ్వు పుట్టావ్. మీ అమ్మమ్మే నిన్ను పెంచింది. వైషూ యిప్పుడున్న యేజ్‌కి నువ్వొచ్చేసరికి నాకు ముప్ఫై దాటాయి. నన్ను నేనే యెలా అర్థం చేసుకున్నానో లేదో కూడా తెలీదు. అసలప్పుడు పిల్లల్ని అర్థం చేసుకొంటూ పెంచాలన్న కాన్సెప్ట్ యెక్కడుంది. మాట వినకపోతే వీపు మీద రెండు వేయటం తప్పు... అసలప్పుడు పిల్లల్ని కొట్టకూడదనే రూలెక్కడుంది. ఆ యెరికేది. అమ్మమ్మలు మాత్రం పిల్లల్ని కొట్టేవారు కాదనుకో. చాలా ప్రేమగా చూసుకొనేవారు . యిప్పుడీ డౌట్ యెందుకొచ్చింది?" అడిగారు కనకవల్లి.
"యేం లేదు లే" అని ఆమె కోసం తెచ్చిన పుస్తకాన్ని యిచ్చింది. "యీ అమ్మాయి చాలా బాగా రాస్తుంది" అన్నారామె. యింగ్లీష్ చదవటం రాకపోతే యీ అమ్మాయిని మిస్ అయ్యేదాన్నని తల్లి అన్నప్పుడంతా యింద్రాణికి తల్లికి భాషలను త్వరగా పట్టుకునే స్కిల్ భలే వచ్చింది. తనకి రాలేదది. కాని మళ్ళీ వైశాలికి ఆ స్కిల్ వచ్చినందుకు యింద్రాణికి సంతోషంగా వుంటుంది.
కిరీటికి కాల్ చేసింది.
"యిందూ.. చాలా పెద్ద సమస్య వచ్చింది. క్రాంతికి అమెరికాలో జాబ్ వచ్చింది. వెళ్లనంటున్నాడు. యెలా.. నువ్వు

మాటాడతావా?” ఆందోళనగా అడిగాడు.

“యెందుకని”

“పిచ్చి పట్టుకొంది. యిందు. అసలు యెంత మంచి జాబ్ అనుకున్నావ్. యేడాది తిరక్కుండానే చాలా ప్రాపర్టీ కొనుక్కోవచ్చు. చెపితే వినటం లేదు” అన్నాడు.

“యేంటి రీజన్?”

“ప్రేమ”

“అంటే” కుతూహలంగా అడిగింది యింద్రాణి.

“ ఆ మధ్య చుట్టాల పెళ్లికి వెళ్లాం. అక్కడో అమ్మాయిని చూసాడు. తనేం వెళ్లి ఆ అమ్మాయితో మాటాడలేదు. మాకే చెప్పాడు. సేమ్ క్యాస్ట్. మాటాడాం. కాని ఆ అమ్మాయికి అమెరికా వెళ్లటం యిష్టం లేదు. అది మాకు వోకే అయితేనే మిగిలిన విషయాలు మాటాడతాం అన్నారు. అంతే వీడు ఆ అమెరికా వద్దు. యీ అమ్మాయే కావాలంటున్నాడు. యీ అమ్మాయి కాకపోతే మరో అమ్మాయి. యింతకంటే అందమైన వాళ్లే దొరుకుతారంటే వినడే. యెలా.. యింకో విషయం తెలుసా.. అన్నీ నా జీవితానికే రావాలా.. ఆ పిల్లకి యీ వుద్యోగాలు అవీ కంటే వాళ్ల వూర్లో వ్యవసాయం చేసుకోవటం యిష్టమంట. అయితే అది ఆ పిల్ల ఛాయిస్ కానీ అబ్బాయి తనకి నచ్చిన పని చేసుకోవటం. వోకేనంట. క్రాంతికి యేమైయిందో యేంటో.. అసలా ఐడియా యెంత బాగుందో.. ఆ అమ్మాయి వూర్లోనే నేనూ యేదైనా కాలేజ్ స్కూల్ లేదా మరొక బిజినెస్ చేస్తాను అని సంబరపడుతున్నాడనుకో.. యీ ఆలోచనలు విని వాళ్ళమ్మ పరువెక్కడ పోతుందోనని బి.పి. తెచ్చుకొంది. అసలు వీడికిలాంటి తిక్క వుందనే తెలీదు యిందూ. నా కొలీగ్ పిల్లలు, బంధువుల పిల్లలు అంతా స్టేట్స్‌లో మంచి మంచి సంస్థల్లో వున్నారు. యీ రిసెషన్ టైమ్‌లో వీడికి యింత మంచి జాబ్ వచ్చిందంటే క్రాంతి యెంత యింటిలిజెంటో ఆలోచించు.

గ్రాండ్ పార్టీ యిచ్చాం. నాలుగైదు సంబంధాలు వచ్చాయి. అమెరికాలో స్థిరపడినవాళ్ళు. అక్కడ వుద్యోగం వున్నవాళ్లు. అక్కడ వుద్యోగం వచ్చే అవకాశం వున్నవాళ్లు. పెళ్లి విషయంలో మేం వాడినేం యిబ్బంది పెట్టలేదు. వాడికి నచ్చిన అమ్మాయినే చేద్దాం అనుకున్నాం. కాని యిదేం పైత్యం. మమ్మల్ని యిలా నలుగుల్లో అవమానించటం తప్పుకదా. యెలా యిందూ వాడిని దారిలోకి తీసుకురావటం. నీ మాట వింటాడేమోనని నీతో మాట్లాడిద్దామని ఫోన్ చేసా” అన్నాడు ఆవేదనతో కిరీటి.

యింద్రాణికి తెరలు తెరలుగా నవ్వొస్తుంది. అరే యీ విషయం యింత ఆవేదనని కలిగిస్తుందా కిరీటికి.

అసలు కిరీటి వొకప్పటి ఆలోచనలు కాని అభిప్రాయాలు కాని లేశమాత్రమైనా లేవా! వున్నా దేశంలో వుంటాననటం అతనికి యెందుకంత ఆందోళన కలిగిస్తోంది. క్రాంతికి యిష్టమైన జీవితాన్ని యెంచుకోవటం పట్ల కిరీటికి యింత అభ్యంతరం యెందుకుంది.

“మాట్లాడవేంటి యిందూ?” అసహనంగా అడిగాడు.

“ఆలోచిస్తున్నా కిరీటి. నువ్వెందుకంతలా అప్‌సెట్ అవుతన్నావని”

“అరే.. యిందూ.. కెరీర్.. కన్నకొడుకు యిలా కెరీర్‌తో ఆటలాడుతూ వుంటే కడుపు తరుక్కుపోతుంది యిందూ?” అన్నాడు కిరీటి.

“యిక్కడ కూడా కెరీర్ వుంటుంది కదా కిరీటి. మనమిక్కడేగా బతుకుతున్నాం”

“వో.. గాడ్ యిందూ మనమున్న రోజులు వేరు. యిప్పుడు వేరు. గత కొన్నాళ్ళుగా పిల్లల కెరీర్ అంటేనే యు.ఎస్. నువ్వు మాత్రం రేపు వైషూకి అమెరికా సంబంధం చూడవా... వుద్యోగానికి అక్కడికి పంపించవా...?” వుక్రోషంగా అన్నాడు కిరీటి.

“నేనేం అమెరికా వెళ్ళు, వద్దు అని చెప్పను. వైషూ ఛాయిస్ వింటాను.ప్రోస్ అండ్ కాన్స్ చెపుతా తననే ఆలోచించుకోమను. డెసిషన్ వైషూదే. మరీ కింద పడిపోయే డెసిషన్ అయితే తప్ప నేనేం తనకి అడ్డు చెప్పను” అంది యింద్రాణి.

"యిందూ... నేను వాడితో ఫోన్ చేయిస్తా. యిలా మాట్లాడకు. కాస్త నచ్చచెప్పటానికి ప్రయత్నించు. ప్లీజ్" అన్నాడు కిరీటి.

"క్రాంతి యేం చెపుతాడో వింటాను కిరీటి. మరీ అలా అప్‌సెట్ కాకు" అంది యింద్రాణి.

రీఛార్జ్ చేయించుకుంటానని వెళ్లిన వైశాలి తిరిగొచ్చింది.

"యింత లేటా... యింతసేపెందుకయ్యింది?" అడిగింది యింద్రాణి.

"నేనిందాకే వచ్చాను మామ్. భలే యింట్రస్టింగ్ లవ్ స్టోరీ. క్రాంతి కాల్ చేసాడు. తనకి నచ్చిన గర్ల్ పేరు స్నేహ. అమెరికా రాదంట. స్నేహ ఐడియాస్,స్నేహ క్రాంతికి పిచ్చపిచ్చగా నచ్చాయంట. అంకుల్, ఆంటీ అప్‌సెట్ అయ్యారంట. యిందు ఆంటీని మా మమ్మీ డాడీతో మాట్లాడించు. వాళ్లని కన్విన్స్ చేయమను. వాళ్లని కాదని వెళ్లి నేనేం స్నేహాని పెళ్లి చేసుకోను. వాళ్లని వొప్పించాలి. వాళ్లు కూడా హ్యాపీగా వొప్పుకుంటే మా పెళ్లయిపోతుంది. మామ్ నేను నిన్ను కన్విన్స్ చేస్తే నాకో పేద్ద డైరీ మిల్క్ ప్యాకెట్ ప్లస్ వన్‌మంత్ రీఛార్జ్ తనే చేయిస్తాడంట. ప్లీజ్ మామ్. క్రాంతికి హెల్ప్ చెయ్యి" అని రికమెండ్ చేస్తున్న వైశాలిని చూస్తే బోల్డంత నవ్వొచ్చింది యింద్రాణికి.

"యిప్పటివరకు అంకుల్ క్రాంతిని వొప్పించమని మాట్లాడారు.వొప్పిస్తే నాకేమిస్తానని చెప్పలేదు. క్రాంతియే బెటర్. నీకేవో యిస్తానన్నాడు" అంటూ నవ్వింది యింద్రాణి.

"వో.. అంకుల్ నీకు చేసారా.. యేం చేయబోతున్నావ్" ఆసక్తిగా అడిగింది వైశాలి.

"ఆలోచించనీ" అంది యింద్రాణి.

– – –

కాలేజ్‌కి బయలుదేరుతొన్న వైశాలికి వో యెర్రని నైటింగేల్ బుక్ యిచ్చి "వైషూ... యీ పుస్తకాన్ని కిరీటి అంకుల్ యెడ్రస్‌కి కొరియర్ చేయవా" అడిగింది యింద్రాణి.

"యిదేంటి మామ్"

"సీక్రెట్" అంది యింద్రాణి.

– – –

వారం రోజుల తర్వాత సిస్టమ్ ముందు కూర్చుని మెయిల్ చూస్తున్న యింద్రాణిని "మామ్.. రీఛార్జ్ చేయించవా" బతిమాలుతోన్నట్టు అడిగింది వైశాలి.

వో రెండు నిముషాల తర్వాత తలతిప్పి "నేనివ్వను" అంది యింద్రాణి.

"అప్పుడే రెండు రోజులయ్యింది మామ్.. ప్లీజ్ మామ్.. వో ఫిఫ్టీఫైవ్" బతిమాలుతోంది వైశాలి.

"వో మై డియర్... నీ రీఛార్జ్ క్రాంతితో మాట్లాడుకో. నీ డైరీ మిల్క్ కూడా పంపించెయ్యమను" అంది యింద్రాణి.

వైశాలి వో క్షణం తర్వాత మెరిసే కళ్ళతో నవ్వుతూ.. "వో మైగాడ్... అంకుల్‌ని వొప్పించావా... అస.. వైశాలి యింకా యేదో అడగబోతోంటే "గతమెంతో మేలు చేసెన్... అని కిరీటికి అర్థమైనట్టు యెలా చెప్పావ్ యిందూ" అంటూ కనకవల్లి గారు గదిలోకొచ్చి అడిగారు.

"నీకూ తెలుసా విషయం?" అడిగింది యింద్రాణి.

"క్రాంతి వాళ్ల నాన్నమ్మ ఫోన్ చేసింది. మా వాడికి తిక్క కాకపోతే పిల్లాడిని బాధపెట్టటమేంటండి. మా కిరీటి చేస్తానన్న వుద్యోగం, చేసుకుంటానన్న పెళ్లిని మేం కాదన్నామా.. వాడు సంతోషమే మా సంతోషం అనుకోలేదా.. చదవేస్తే వున్న మతి పోయినట్టు కళ్లముందు కొడుకు వుంటానంటే బాధపడతాడేంటండీ. మీరు కాస్త యిందూకి చెప్పి, మా వాడికి, మా కోడలికి బుర్రకి పట్టిన కిలుం వదిలించమని చెప్పండి అని అడిగారు" అన్నారామె.

"వో.. గాడ్.. యెంత నెట్‌వర్క్ నడుస్తోందీ యింట్లో. క్రాంతి రీఛార్జ్ కార్డు, డైరీ మిల్క్ విషయం వెంటనే ఫేస్‌బుక్‌లో పోస్ట్

చేయాలి..” హడావిడి పడుతోంది వైశాలి.
“అరే.. ప్రతీది ఫేస్‌బుక్‌లోనా!?” అంది కనకవల్లి.
“మీకు యింత నెట్‌వర్క్ వుంది. మాకుండొద్దా.. అమ్మమ్మా. యింతకీ నువ్వు పంపించిన ఆ నైటింగేల్ పుస్తకంలో యేముంది మామ్” అడిగింది వైశాలి.
“కవిత్వం” చెప్పింది యింద్రాణి.
“కవిత్వమా... యేం కవిత్వం.? ఆ కవిత్వం అంత పవర్‌ఫుల్లా..? యెవరు రాసారు?” ఆశ్చర్యపోతూ అడిగింది వైశాలి.
“అప్పుడెప్పుడో కిరీటి అంకుల్ రాసుకున్నదే.అందుకే అంకుల్‌కి పవర్‌ఫుల్‌గా అనిపించి వుంటుంది” అంది యింద్రాణి నవ్వుతూ.
“ యీ రీఛార్జ్, డైరీ మిల్క్ కంటే కవిత్వం క్రాంతి ప్రోబ్లమ్‌ని సాల్వ్ చేయటం మోస్ట్ యింట్రస్టింగ్ న్యూస్. యిది పోస్ట్ చేయాలి యెలాగైనా సరే.. కొన్ని లైన్స్ చెపుతావా మామ్” అడిగింది వైశాలి.
“మీ అంకుల్‌నే అడుగు” అంది యింద్రాణి.
కిరీటికి కాల్ చేసింది వైశాలి.
నిండు గోదారి కదా యీ ప్రేమ... రింగ్ టోన్ వినిపిస్తూనే వుంది.
“అంకుల్ రింగ్‌టోన్ విని యెవరైనా కుర్రాడనుకుంటారేమో మామ్...” అంది వైశాలి.
“ప్రపంచం యెంతగా మారిపోయినా ప్రేమకేదో సజీవ లక్షణం వుందనుకుంటా. యెన్ని రకాల పాటలొచ్చాయ్. మ్యూజిక్ యెంతగానో మారిపోయింది. కాని కిరీటి చూడు. అప్పటెప్పటి పాటో రింగ్‌టోన్‌గా పెట్టుకున్నాడు. అతని యవ్వన కాలాన్ని మురిపించిన పాటేమో..! అతను ఆ కాలంలో రాసిన కవిత్వాన్ని చూడగానే అతన్లో యెక్కడో యింకిపోయిన ప్రేమ తిరిగి చిగురించిందేమో.కొడుకు మనస్సుని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు” అన్నారు కనకవల్లి.
కాల్ కట్ అయ్యింది. తిరిగి రింగ్ చేసింది వైశాలి. తిరిగి తిరిగి అదే పాట.... గోదారంత ప్రేమగా...!!!

***

(వచ్చేనెల మరో కథతో కలుసుకుందాం..)

Post your comments